## శాంతి కోసం...

ఐక్యరాజ్య సమితి ప్రతి ఏటా మార్చి 22వ తేదీన ప్రపంచ నీటి దినోత్సవాన్ని జరుపుతుంది. అందులో భాగంగా ఈ ఏడాది 'వాటర్ ఫర్ పీస్'... అంటే 'శాంతి కోసం నీరు' అన్న థీమ్‌ను తీసుకొచ్చింది. ప్రపంచ దేశాలు శాంతి సుభిక్షాలతో ఉండాలంటే నీటి లభ్యత బాగుండాలన్న ఉద్దేశాన్ని చెబుతున్నది. నీరు శాంతిని నెలకొల్పగలదు. చిచ్చునూ రేపగలదు. నీటి కొరత, కలుషిత జలాలు, ప్రజలందరికీ సమానమైన నీటి లభ్యత లేకపోవడం లాంటివి వర్గాల మధ్య, దేశాల మధ్య ఘర్షణలకు దారి తీస్తాయి. ప్రపంచంలోని 153 దేశాలు నదులు, కాలువలు, సరస్సుల్లాంటి జల వనరుల్ని సరిహద్దులలో పంచుకుంటున్నాయి. ఇలా రెండు దేశాల మధ్య పారే నీటితో ప్రపంచ వ్యాప్తంగా సుమారు 300 కోట్ల జనాభా ఆధారపడుతున్నారు. అయితే, ఇందులో కేవలం 24 దేశాలు మాత్రమే పరస్పర సహకార ఒప్పందాలు కలిగి ఉన్నాయి. మానవహక్కుల రక్షణకు, సుస్థిరాభివృద్ధికీ నీరు ఉత్ప్రేరకంలా పనిచేస్తుందనీ...  వాతావరణ మార్పులు, పెరుగుతున్న జనాభా నేపథ్యంలో, మనకున్న అత్యంత అమూల్యమైన జల సంపదను... ఉమ్మడిగా రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందంటూ ఐరాస పిలుపునిస్తున్నది.

**ఒక A4 సైజు పేపర్ తయారు చేయడానికి 10 లీటర్ల దాకా నీళ్లు పడతాయి.**

**5**

**6**

**పది నిమిషాలు షవర్ కింద స్నానం చేస్తే.. మనం పెట్టుకున్న స్పీడును బట్టి తొంభై లీటర్లు మొదలు 190 లీటర్ల వరకూ నీరు మురుగులో కలుస్తుంది.**

# నీళ్లులేని నగరం.. నేర్పింది పాఠం!



మనిషి ప్రకృతిలో భాగం. దానితో కలిసి, దాని మీద పడి మనం బతకాల్సిందే. కానీ ప్రకృతిని పాడు చేసి, దానికి విరుద్ధంగా పనిచేసి చిట్టచివరికి ప్రకృతితో కొట్లాడి బతకాల్సిన పరిస్థితి దాపురించింది ఒక నగరానికి. ఎంతలా అంటే తాము బతకాలంటే, తమ గొంతుక తడవాలంటే.. అక్కడ ఉన్న చెట్లు నీళ్లు తాగకూడదు. వాటిని కొట్టేయాల్సిందే! అని ప్రభుత్వాలు కంకణం కట్టుకుని అమలు చేసిన దుర్భర పరిస్థితిని మనం చూడొచ్చు. అవి పీల్చుకునే నీళ్లతో మేం రెండునెలలు బతుకుతాం..



అంటూ సంప్రదాయేతర చెట్లను నరికింది కేప్‌టౌన్ అనే ఓ నగరం. సౌతాఫ్రికా మూడు రాజధానుల్లో ఒకటి కేప్‌టౌన్. సుమారు అరకోటి జనాభా ఉన్న ఈ నగరం గడచిన కొన్నేండ్లుగా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నది. కొన్నాళ్ల క్రితం రోజుకు యాభై లీటర్ల నీటిని మాత్రమే వాడుకోవాలంటూ పౌరులకు పిలుపునిచ్చింది. అలా ప్రభుత్వం నీరు అందించే కుళాయిల దగ్గర మిలిటరీ బలగాలను, పోలీసుల్ని కాపలా ఉంచింది. అక్కడి పౌరులకు రోజూ స్నానం చేయడం ఓ లగ్జరీ. ట్యాప్ నీళ్లతో కారు కడగడం నేరం. కావాలనుకున్నప్పుడల్లా బట్టలు ఉతకడం ఓ కల. కొత్తగా లాన్లు పెంచాలంటే పర్మిషన్లు కావాలి. తమ పౌరుల మీద ఇన్ని ఆంక్షలు అమలు చేసినా సరే నీటి కొరత ఆ దేశాన్ని పీడిస్తూనే ఉంది. ఇంతలా నీటి కొరత వేధిస్తుడటంతో.. ఆ దేశ అధికారులు ఒక ఆలోచన చేశారు. అక్కడి కొండలు, లోయల్లో పెరుగుతున్న పైన్, బ్లాక్ వాటిల్, గమ్ చెట్లు అత్యధికంగా భూగర్భజలాలను పీలుస్తున్నాయని పరిశోధించారు. కాబట్టి వాటిని కొట్టేయడం ద్వారా ఆరేండ్లలో ఏడాదికి రెండు నెలలకు సరిపడా నీటిని మిగుల్చుకోవచ్చని తేల్చారు. గత అయిదేండ్లుగా ఆ పని కొనసాగిస్తున్నారు. గాలి వాటంగా గింజలు పడే ఈ చెట్లు త్వరగా పెరుగుతుండటంతో మంట పెట్టి కాల్చుతున్నారు కూడా. వీటిని ఇలాగే తొలగించగలిగితే వచ్చే 30 ఏండ్లలో ఒక సంవత్సరంలో నగరానికి నాలుగు నెలలకు సరిపడా నీటిని పొదుపు చేసినట్టేనని చెబుతున్నారు. ఆ చెట్లు స్థానికమైనవి కావన్నమాట వాస్తవమే అయి ఉండొచ్చు. కానీ, చెట్లు తాగే నీటి శాతాన్ని లెక్కించి వాటిని కొట్టేసే ప్రయత్నం చేయాల్సి రావడం మాత్రం తప్పకుండా కరవుకు తార్కాణమే.

విదేశాల సంగతి కాదు. ఇటీవల మన పక్క రాష్ట్రం కర్ణాటక కూడా ఎండకాలం మొదట్లోనే తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నది. దీంతో నీటిని వృథా చేసిన వాళ్లకు 5000 రూపాయల జరిమానా విధిస్తామని బెంగళూరు నీటి నిర్వహణ మండలి ప్రకటించింది. అంతేకాదు ఎవరైనా నీటిని వృథా చేస్తున్నట్టు గమనిస్తే తమకు తెలపాలని ఒక కాల్‌సెంటర్‌నూ ఏర్పాటు చేసింది. కార్లు కడిగేందుకు, గార్డెన్లు, స్విమ్మింగ్‌పూళ్లు, ఫౌంటెయిన్లకు మంచినీటిని వాడితే ఊరుకోబోమని కూడా హెచ్చరించింది. గతంలో చెన్నై కూడా ఇలాంటి నీటి ఎద్దడినే ఎదుర్కొంది. మన పక్కన ఉన్న మహారాష్ట్ర సంగతి చెప్పనే అక్కర్లేదు. లాతూర్‌కు నీళ్లు సరఫరా చేసేందుకు ఏకంగా రైలు నడిపిన సంగతి భారతదేశమే మర్చిపోలేదు. మిగతా దేశాలకు భిన్నంగా మన దగ్గర నదులున్నాయి. అడవులూ ఉన్నాయి. ఎండకాలం దాటితే ఈ కరవు తీరిపోవచ్చు. కానీ వానకాలాలు కలకాలం ఒకేలా ఉండవు. మన నీటి అవసరాలు మాత్రం అలాగే ఉంటాయి. మరి వాటిని తీర్చుకోవాలంటే ఒక్కో బొట్టూ ఒడిసిపట్టాల్సిందే. మన కోసమే కాదు, మన ముందు తరాల కోసమూ నీటి చుక్కను బంగారు ముక్కంత అపురూపంగా చూసుకోవాల్సిందే. జలమే జయం.. అన్నమాట మనసారా అంగీకరించాల్సిందే!